క్లుప్తంగా

అరుణాచలేశ్వరస్వామికి రుద్రాభిషేకం


విశేష అలంకరణలో అరుణాచలేశ్వరస్వామి

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లి అరుణాచలేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం ఆలయ పండితులు స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రీరమణా సేవాశ్రమం వ్యవస్థాపకులు స్వామీరామానంద ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

గండేపల్లి: మండలంలోని మల్లేపల్లిలో పేకాట శిబిరంపై సోమవారం పోలీసులు దాడి చేశారు. గ్రామ శివారులో పేకాడుతున్నట్టు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు ఎస్సై యు.శివ నాగబాబు తన సిబ్బందితో దాడి చేశారు. పేకాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.3,100 స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

మద్యంతో వ్యక్తి అరెస్టు

తాళ్లూరులో అక్రమంగా మద్యం కలిగి ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని నుంచి 15 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

లారీ ఢీకొని గేదె మృతి

జాతీయ రహదారిపై మండలంలోని తాళ్లూరులో లారీ ఢీకొని గేదె మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. దీని విలువ సుమారు రూ.50,000 ఉంటుందని చెప్పారు.

టీచర్ల సర్దుబాబు బహిష్కరణ


ఎంఈఓ రాజబాబుకు నోటీసు అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

ప్రత్తిపాడు: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఇచ్చిన పిలుపు మేరకు టీచర్ల పని సర్దుబాబు ప్రక్రియను ఉపాధ్యాయులు బహిష్కరించారు. ఈ మేరకు ప్రత్తిపాడు మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబుకు సోమవారం ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల పని సర్దుబాబు ప్రక్రియ చాలా అసంబద్ధంగా ఉందన్నారు. ఉపాధ్యాయ సంఘాలు చెప్పిన ఏ అంశాన్ని పరిగణనలోకి తీసుకోకుండా రాష్ట్ర విద్యాశాఖ ఏకపక్షంగా ఈ ప్రక్రియ చేపట్టడాన్ని నిరసిస్తూ బహిష్కరిస్తున్నట్టు చెప్పారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు కోడి శ్రీనివాసరావు, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.శ్రీనివాస్, తెలుగు పండిట్ల సంఘ జిల్లా అధ్యక్షుడు కె.పెద్దబ్బాయి, యూటీఎఫ్ ప్రతినిధులు ఎం.రాజబాబు, చుక్కల లక్ష్మీగణేష్, మెర్సీ స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

'అల్లూరి'కి బీజేపీ శ్రేణుల నివాళులు


ప్రత్తిపాడులో అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్

ప్రత్తిపాడు: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రత్తిపాడులో సోమవారం ఆ పార్టీ శ్రేణులు అల్లూరి సీతారామరాజుకు ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ ఆధ్వర్యంలో అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్వచ్ఛ భారత్ నిర్వహించారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శింగిలిదేవి సత్తిరాజు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కిరిగడ్డ గంగరాజు, నియోజకవర్గ పార్టీ నాయకులు ఊటా వీరబాబు, కందా వీరాస్వామి, రామకుర్తి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమాన హక్కులతోనే మహిళాభివృద్ధి

సామర్లకోట: మహిళలకు సమానమైన హక్కులు కల్పిస్తూ, వారిని గౌరవించడం ద్వారానే అభివృద్ధి సాధ్యమని సీనియర్ ఫ్యాకల్టీ శ్రీదేవి అన్నారు. స్థానిక టీటీడీసీలో శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకున్న 11 జిల్లాల్లోని ఉన్నతాధికారులకు నిర్వహించిన శిక్షణను సోమవారం ఆమె ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి రాష్ట్రంలోను సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. మహిళా స్నేహ పూర్వక గ్రామం అనే అంశంపై మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తారన్నారు. మహిళలు, బాలికలపై నేరాల నియంత్రణ, అన్ని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో మహిళలకు భద్రత ఉండేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఫ్యాకల్టీలు వి ప్రసాద్, కేఎస్ఆర్ నిహారిక, పద్మజ, చక్రపాణి రావు, బి.ఆంజనేయులు, బి.వెంకటేశ్వర్లు శిక్షణ నిర్వహించారు.

ప్రకృతి సాగు.. లాభాలు బాగు

- తక్కువ పెట్టుబడితో ఆరోగ్యవంతమైన దిగుబడులు
- ఆసక్తి చూపుతున్న రైతులు
- నియోజకవర్గంలో 3 వేల ఎకరాల్లో సాగు


ప్రకృతి సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది


సహజ సిద్ధమైన ఎరువులు తయారు చేస్తున్న రైతులు

రౌతులపూడి: కరోనా వచ్చాక ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన పెరిగింది. రసాయనాలు, పురుగు మందులు వినియోగించి సాగు చేసిన ఆహార పదార్థాల వలన ఆరోగ్యం దెబ్బతింటుందని గ్రహించిన ప్రజలు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల వైపు మళ్లారు. అధికశాతం ప్రజలు సహజ సిద్ధంగా పండించిన ఆహార పదార్థాలను వినియోగిస్తున్నారు. దీంతో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండ్ పెరిగింది. పలువురు రైతులు పకృతి వ్యవసాయంపై మొగ్గు చూపుతున్నారు. ఆరోగ్యానికి హాని కల్గించే రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా సహజ ఎరువులతో పంటలను సాగు చేస్తున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించి లాభాలు గడిస్తున్నారు.

నియోజకవర్గంలో...

నియోజగవర్గంలోని రౌతులపూడి, శంఖవరం, ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాల్లో సుమారు 3 వేలకు పైగా ఎకరాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. వరితో పాటు రాగులు, కొర్రలు, జొన్నలు వంటి చిరు ధాన్యాలు, కందులు, మినుములు, పెసలు, బొబ్బర్లు, నువ్వులు వంటి పప్పు దినుసుల పంటలను రైతులు సాగు చేస్తున్నారు. అలాగే వంగ, మిరప, ఆనబ, ఆకాకర, టమాటా, గుమ్మడి, బెండ, బీర, చిక్కుడు, గోరుచిక్కుడు వంటి కూరగాయలు, తోటకూర, పాలకూర, మెంతుకూర, కొత్తి మీర, గోంగూర తదితర ఆకుకూరలను ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిస్తున్నారు. ఒక్క రౌతులపూడి మండలంలోనే 620 ఎకరాల్లో వరి, 80 ఎకరాల్లో రాగులు, కొర్రలు, జొన్నలు, 62 ఎకరాల్లో కూరగాయలు, ఆకుకూరలు, 95 ఎకరాల్లో పత్తి, 125 ఎకరాల్లో జీడిమామిడి తోటలను రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్నారు. శంఖవరం, ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాల్లోనూ అదే రీతిలో రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

స్వయంగా ఎరువులు తయారీ

రసాయన ఎరువులకు స్వస్తి పలికి సహజ సిద్ధమైన ఎరువులను రైతులే స్వయంగా తయారు చేసుకుంటున్నారు. దీంతో పెట్టుబడి ఖర్చు తగ్గుతోంది. సహజసిద్ధమైన ఘనామృతం, బీజామృతం, ద్రవ జీవామృతం, జిగురు అట్టలు, లింగాకర్షక బుట్టలు, పోషక లోపాల నివారణకు పేడ, మూత్రం, ఇంగువ ద్రావణం వంటి వాటిని ఎరువులుగా వినియోగిసున్నారు. దీంతో పెట్టుబడి తగ్గి అధిక ఆదాయం, ఆరోగ్యకర పంటలను పొందుతున్నామని రైతులు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



మాకు ఉన్న కొద్దిపాటి భూమిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాను. గతంలో కంటే ఇప్పుడు పంట దిగుబడి పెరిగింది. దీంతో లాభాలు వస్తున్నాయి. ఈ ఏడాది కుజువు బతాని రకం వరిసాగు చేపట్టాను. రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా ఆవుపేడ, ఆవు మూత్రంతో కూడిన సహజ ఎరువులను సాగుకు వినియోగిస్తున్నాను.

– సలాది గిరిబాబు, రైతు, ఉప్పంపాలెం

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



గ్రామాల్లో ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రైతులు కూడా ప్రకృతి సాగుపై ఆసక్తి చూపుతున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ నాణ్యత కల్గిన పంటను రైతులు సాగు చేస్తున్నారు. సమాజానికి ఆరోగ్యకరమైన ఉత్పత్తులను అందించడానికి గాను రైతులు ప్రకృతి సాగు చేపట్టాలి.

– దాడి వరలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ కో ఆర్డినేటర్, రౌతులపూడి మండలం

విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగుల పంపిణీ


ఏలేశ్వరంలో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు అందజేస్తున్న కౌన్సిలర్లు

ఏలేశ్వరం: మండలంలోని పలు గ్రామాల్లోని విద్యార్థులకు సోమవారం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. మండలంలోని సిరిపురం, యర్రవరం, తిరుమాలి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర పథకంలో భాగంగా పుస్తకాలు, బ్యాగులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో మౌళిక వసతులకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ నగర్ ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు కౌన్సిలర్లు మూది నారాయణస్వామి, వై.నాగబాబు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మామిడి లలిత, కోరాడ కృష్ణమోహన్, సామంతుల గోపి తదితరులు పాల్గొన్నారు.

స్మృతివనంపై దాడికి నిరసనగా ఆందోళన


కిర్లంపూడిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న దళిత నాయకులు

కిర్లంపూడి: విజయవాడలోని స్మృతివనంపై జరిగిన దాడిని నిరసిస్తూ దళిత సంఘాల నేతలు సోమవారం కిర్లంపూడిలో ఆందోళన చేపట్టారు. అంబేడ్కర్ స్మృతివనాన్ని ధ్వంసం చేసిన అల్లరి మూకలపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణ్యమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును దళిత సంఘాలు ముక్తకంఠంతో వ్యతిరేకించాయి. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అన్నదమ్ముల్లా కలిసి మెలసి ఉన్న కులాల మధ్య చిచ్చుపెట్టిలా ఉందన్నారు. ఆర్టికల్ 341 ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. అనంతరం కిర్లంపూడిలోని ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత నాయకులు, అంబేడ్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు


పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

గోకవరం: గ్రామ శివారున అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళితే... గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారని అందిన సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. మద్యం విక్రయిస్తున్న సానపల్లి సీతారామరాజును అదుపులోకి తీసుకుని అతని నుంచి 49 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయించినా, అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ


జగ్గంపేటలో జాతీయ జెండాలతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో సోమవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు జాతీయ జెండాలతో కళాశాల నుంచి ర్యాలీ చేశారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బాలరాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు దేశభక్తిని పెంపొందించే పాటలు, నాటకాలు, ఏకపాత్రాభినయం తదితర కార్యక్రమాలను ఈ నెల 15 వరకూ నిర్వహిస్తామని తెలిపారు.

తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ


తహసీల్దార్ చిరంజీవికి శుభాకాంక్షలు తెలుపుతున్న వీఆర్వోలు


ప్రత్తిపాడులో తహసీల్దార్ సూర్యప్రభకు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

కిర్లంపూడి: మండల తహసీల్దార్‌గా జె.చిరంజీవి సోమవారం బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఆయన గండేపల్లి తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. ఎన్నికల అనంతరం సాధారణ బదిలీల్లో భాగంగా కిర్లంపూడి మండలానికి వచ్చారు. సోమవారం బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌ను కార్యాలయ సిబ్బంది, పలు గ్రామాల వీఆర్వోలు, వీఆర్ఏలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రత్తిపాడు తహసీల్దార్‌గా సూర్యప్రభ

ప్రత్తిపాడు: మండల తహసీల్దార్‌గా ఎం.సూర్యప్రభ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. శాసనసభ ఎన్నికల అనంతరం స్థానిక తహసీల్దార్ కృష్ణా జిల్లాకు బదిలీ కాగా ఆయన స్థానంలో ఏలూరు జిల్లా పెదవేగి మండల తహసీల్దార్‌గా పని చేస్తున్న సూర్యప్రభ బదిలీపై ఇక్కడకు వచ్చారు. నూతన తహసీల్దార్ సూర్యప్రభకు డిప్యూటీ తహసీల్దార్లు టి.శ్రీనివాసరావు, కె.పుణ్యవతి, మండల సర్వేయర్ షేక్ బషీర్, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

జగ్గంపేట తహసీల్దార్‌గా రమేష్

జగ్గంపేట: మండల తహసీల్దార్‌గా జేవీఆర్ రమేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఏలూరు జిల్లా కామవరపుకోట తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆయన బదిలీపై జగ్గంపేట వచ్చారు. ఆయనకు డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ రామిరెడ్డి, ఆఫీస్ సిబ్బంది స్వాగతం పలికారు. బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ రమేష్‌కు స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న హైవే అంబులెన్స్ సిబ్బంది

గండేపల్లి: హైవే మెయింటినెన్స్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా వాహనాలు ప్రమాదానికి గురై ఓ వ్యక్తి గాయాల పాలయ్యాడు. మండలంలోని మల్లేపల్లి శివారు విశాఖ వైపు వెళుతున్న మార్గంలో హైవే మెయింటినెన్స్ సిబ్బంది రోడ్డు పనులు నిర్వహిస్తున్నారు. రోడ్డుకు మధ్యలో ట్రాఫిక్ నిమిత్తం కేవలం కోన్ (ప్లాస్టిక్ పోల్స్)లు మాత్రమే ఏర్పాటు చేసి పనులు చేస్తున్నారు. వాహనాల వేగాన్ని నియంత్రించేదుకు సిబ్బందిని ఏర్పాటు చేయకపోవడంతో సోమవారం రెండు వాహనాలు ఢీకొన్నాయి. ముందు వెళుతున్న వ్యాన్ డ్రైవర్ షడన్‌గా బ్రేక్ వేయడంతో వెనకే వస్తున్న రెండు కార్లు, ఆటో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న గండేపల్లికి చెందిన బయంపూడి సత్యనారాయణ గాయపడ్డాడు. క్షతగాత్రుడుని హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం జగ్గంపేట ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

శిక్షణ... అభివృద్ధికి రక్షణ


ఏలేశ్వరం శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీపీ రాము


ప్రత్తిపాడు శిక్షణలో ప్రసంగిస్తున్న ఎంపీపీ కాంతి సుధాకర్


తుని శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీపీ రాము

- గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ
- పలు అంశాలపై అవగాహన కల్పించిన అధికారులు

ఏలేశ్వరం: గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా తరగతులను ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ప్రణాళికలు రూపొందించాలన్నారు. శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పంచాయతీ విధులు, నిర్వహణ, అభివృద్ధిపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ జె.శ్రీనివాస్, ఈఓపీఆర్డీ సూర్యనారాయణ, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వండి

తుని: గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని తుని ఎంపీపీ బొప్పన రాము సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. తుని మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులకు మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణా తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. పంచాయతీల పరిధిలో పారిశుద్య నిర్వహణ, సంపద కేంద్రాలు, వీధి దీపాలు, పాలనపై అవగాహన కల్పించారు. అధికారుల సూచనలను పాటించాలని సూచించారు. స్వచ్ఛతను పాటిస్తామని ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రమాణం చేశారు. ఎంపీడీవో, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: ప్రభుత్వాల నుంచి పంచాయతీలకు విడుదలయ్యే నిధులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మూడురోజుల పాటు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించే శిక్షణా తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. గ్రామాల్లో ప్రజా అవసరాలను గుర్తించి, దానికి అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. ఎంపీడీఓ ఎస్.డేవిడ్‌రాజ్, ఈఓపీఆర్డీ కేవీవీఎస్ కాశీ విశ్వనాథం తదితరులు ప్రసంగించారు. ట్రైనర్లు బి.కామరాజు, ఆర్‌వీవీ రమణ, ఎల్.గంగాధర్, పి.మధుకిరణ్ పారిశుధ్యం, రక్షిత మంచినీటి సరఫరా, అభివృద్ధి ప్రణాళికలు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.

రౌతులపూడి: మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఎం.ప్రేమసాగర్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ విధులు, బాధ్యతలు, ఘన వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలపై సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. గ్రామాల అభివృద్ధికి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, సర్పంచ్‌లు రాపర్తి రామకృష్ణ, వి.సత్యన్నారాయణ, మాదాసు దొంగబాబు, తదితరులు పాల్గొన్నారు.

శంఖవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు సోమవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎంపీపీ పర్వత రాజుబాబు ఈ శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎం.విజయ్‌కుమార్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈఓపీఆర్డీ రామకృష్ణ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. పంచాయతీల్లో పారిశుద్యం, చెత్త నుంచి సంపద కేంద్రాలు, వీధి దీపాల నిర్వహణ, పంచాయతీల విధులు, బాధ్యతలు, పంచాయతీరాజ్ చట్టం, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తదితర అంశాలపై ఉన్నతాధికారులు శిక్షణ ఇచ్చారు. మరో రెండు రోజుల పాటు ఈ శిక్షణ కొనసాగుతుందని ఎంపీడీఓ తెలిపారు.

పంచాయతీ విధులపై అవగాహన కలిగి ఉండాలి

గోకవరం: గ్రామ పంచాయతీ విధులపై సర్పంచులు, కార్యదర్శులు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ ఎం.గోవిందు అన్నారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో సర్పంచులు, గ్రేడ్ 1 కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. తొలిరోజు శిక్షణలో భాగంగా పంచాయతీ విధులు, బాధ్యతలు, పారిశుద్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, చెత్త సేకరణ వంటి అంశాల్లో పంచాయతీల పాత్రపై అవగాహన కల్పించారు. అనంతరం డ్రగ్స్ రహిత సమాజంపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి, ఈఓపీఆర్డీ రాజేశ్వరరావు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ దినోత్సవం

ఏలేశ్వరం: పట్టణంలో సోమవారం జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గ్రంథాలయాల ఏర్పాటులో రంగనాథన్ కీలకపాత్ర పోషించారన్నారు. ఆయన సేవలను కొనియాడారు.

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్స్ ఎ.రమేష్, కె.రవిశంకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పాల ప్యాకెట్లు పంపిణీ

కిర్లంపూడి: మండలంలోని తామరాడ ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు సోమవారం దాతలు పాల ప్యాకెట్లు పంపిణీ చేశారు. జనసేన పార్టీ జగ్గంపేట నియోజవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, సర్పంచులు తోట అయ్యన్న, తుమ్మలపల్లి సాయిగుణ శేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పాల ప్యాకెట్లు అందజేశారు. చిన్నారులకు ప్రతి సోమవారం పాల వితరణ కార్యక్రమాన్ని తలపెట్టిన నూతన విద్యా కమిటీ ఛైర్మన్ గోకేడ ప్రసాద్, ఎంపీటీసీ గోకేడ రాజులను వారు అభినందించారు. పలువురు స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.